క్లుప్తంగా

చిన్నారులకు వైద్య పరీక్షలు



చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్ : స్థానిక సీబీరోడ్డులోని మార్కండేయస్వామి ఆలయంలో ఆదివారం బహూత్తమ పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో చిన్న పిల్లల వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 100 చిన్న పిల్లలకు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యుడు జింకా దశరథరామయ్య, హరిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు పద్మశాలీయ సంఘ అధ్యక్షుడు గడ్డం గణేష్ తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీపై దాడి



గాయపడిన నీలావతి

గుత్తి: పట్టణంలోని ఉప్పర వీధిలో నివాసముండే మాజీ ఎంపీపీ నీలావతిపై ఇంటి పక్కన వారే ఆదివారం దాడి చేసి గాయపరిచారు. ఇంటి పక్కన నివాసముండే రామాంజనేయులు, ఆయన కుటుంబ సభ్యులు తనపై అకారణంగా దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో హెల్త్ అసిస్టెంట్ మృతి



జగన్ మోహన్ రెడ్డి(ఫైల్)

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన హెల్త్ అసిస్టెంట్ బత్తుల జగన్ మోహన్ రెడ్డి(45) అనారోగ్యంతో శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. వివరాలు.. జగన్ మోహన్‌రెడ్డి రజాపురంలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేసేవాడు. 15 రోజుల క్రితం అనారోగ్యానికి గురవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో శనివారం అర్ధరాత్రి తర్వాత మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి



శ్రీనివాసులు(ఫైల్)

గుత్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. పట్టణంలోని చెర్లోపల్లి కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శ్రీకరం శ్రీనివాసులు(46) రెండు మాసాల క్రితం బెంగళూరు శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. అప్పట్లో కుటుంబ సభ్యులు అతడిని బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాసులు మృతికి బలిజ సంఘం నాయకులు రమణ, శ్రీకరం గోవిందరాజులు, శ్రీకరం హరి, నరేష్, మంజు, రాము, కేవీ రమణ, పగడాల శ్రీనివాసులు సంతాపం ప్రకటించారు.

మున్సిపల్ డీఈగా రామ్మూర్తి

గుంతకల్లుటౌన్: అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సి.రామ్మూర్తి గుంతకల్లు మున్సిపల్ డీఈఈగా నియమితులయ్యారు. గుంతకల్లు మున్సిపాల్టీలో అసిస్టెంట్ ఇంజినీర్‌లుగా పనిచేస్తున్న ఎం.శిరీషను ధర్మవరం, షేక్ షబానాను కళ్యాణదుర్గం మున్సిపాల్టీలకు బదిలీ చేశారు. షేక్‌షబానా స్థానంలో కదిరిలో పనిచేస్తున్న వి.సుదర్శన్‌ను ఇక్కడికి నియమించారు.

ఘనంగా ఎస్పీ బాలు జయంతి



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి వేడుకలను ఆదివారం స్థానిక ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఈవో రాముడు, కార్యదర్శి జీఎంపీ చలపతి ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుమారు 11 భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడిన మహానుభావుడు ఎస్పీ బాలు అంటూ వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా సభ్యులు ఎస్పీ బాల సుబ్రమణ్యం పాటలను పాడి అలరించారు.

తాడిపత్రి టౌన్: స్థానిక గాంధీ కట్ట సమీపంలోని స్నేహ భారతి సంగీత శిక్షణాలయంలో ఆదివారం గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆయన పాటలను సభ్యులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో శిక్షణాలయ కమిటీ అధ్యక్షుడు మహేష్‌స్వామి, సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, రామకృష్ణ, శివ, పాండురంగయ్య, శ్యామల, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో శింగనమల

- శింగనమల చెరువు లోకలైజేషన్
- సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట
- నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో కాంతులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తి



శింగనమల రంగరాయల చెరువు



కార్పొరేట్ స్థాయిలో రూపుదిద్దుకున్న శింగనమల సీహెచ్‌సీ భవనం

శింగనమల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్లలో శింగనమల నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన సాగింది. నవరత్నాల పథకాలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. దీంతో ప్రజల జీవితాల్లో పెనుమార్పులు వచ్చాయి. రైతులు, మహిళలు, వృద్ధులు, యువత, విద్యార్థులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నెరవేరిన చిరకాల స్వప్నం

జిల్లాలోనే అతి పెద్ద చెరువైన శింగనమల రంగరాయల చెరువు లోకలైజేషన్ ఐదు దశాబ్దాల నుంచి తీరని కలగా మారింది. సమస్యను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లి లోకలైజేషన్ చేయించారు. ఈప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నెరవేర్చారు.

నాలుగేళ్లలో నియోజకవర్గంలోని రైతులకు చేకూరిన లబ్ధి

- రైతు భరోసా పీఎం కిసాన్ కింద 55,698 మంది రైతులకు రూ.280.61 కోట్ల లబ్ధి
- వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 33,035 మంది రైతులకు రూ.10.96 కోట్ల జమ
- వైఎస్సార్ ఉచిత బీమా కింద రూ.52,372 మంది రైతులకు రూ.143.22 కోట్ల లబ్ధి
- ఇన్‌పుట్ సబ్సిడీ కింద 14,145 మంది రైతులకు 16.65 కోట్ల మంజూరు
- ఆత్మహత్య చేసుకున్న 35 మంది రైతు కుటుంబాలకు రూ.2.45 కోట్ల మంజూరు
- సబ్సిడీ విత్తన కాయల కోసం 1,23,446 మంది రైతులకు రూ.32.98 కోట్ల వ్యయం
- ఎపీఎంఐపీ ద్వారా 7,571 మంది ఉద్యాన రైతులకు రూ.12.84 కోట్లు వ్యయం
- వ్యవసాయ ఉచిత విద్యుత్ కోసం 12,258 మంది రైతుల కోసం రూ.417.45 కోట్లు

వివిధ పథకాల వ్యయం ఇలా..

- వైఎస్సార్ పింఛన్ కానుక కింద 42,972 మందికి రూ.505.27 కోట్ల పంపిణీ
- జగనన్న చేదోడు కింద 1,814 మందికి రూ.5.22 కోట్ల లబ్ధి
- వైఎస్సార్ కాపు నేస్తం కింద 888 మంది రూ.2.53 కోట్ల లబ్ధి
- ఈబీసీ నేస్తం కింద 4,884 మందికి రూ.14.20 కోట్ల లబ్ధి
- డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద 15,021 మంది రూ.7.59 కోట్లు లబ్ధి
- 89,032 మందికి హెల్త్ కార్డుల అందజేత
- 33 జగనన్న కాలనీల్లో బోరు తవ్వకాలకు రూ.58 లక్షల వ్యయం
- ఎస్సీ, ఎస్టీల గృహాలకు ఉచిత విద్యుత్ కింద 5,740 మందికిగాను రూ.6.44 కోట్ల లబ్ధి
- లా నేస్తం కింద 13 మందికి రూ.12 లక్షలు, అగ్రిగోల్డ్ బాధితులకు 2,132 మందికి 2.31 కోట్లు అందజేత
- వాహన మిత్ర ద్వారా రూ.1443 మందికి రూ.4.24 కోట్ల పంపిణీ

మహిళలకు భారీగా లబ్ధి

- వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 6,047 మందికి రూ.33.59 కోట్లు లబ్ధి
- వైఎస్సార్ ఆసరా కింద 4,842 మందికి రూ.127.50 కోట్లు
- ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ 5,239 గ్రూపులకు రూ.710.16 కోట్ల రుణాలు
- వైఎస్సార్ బీమా 688 మందికి రూ.11.46 కోట్లు మంజూరు.
- వైఎస్సార్ చేయూత 12,591 మందికి రూ.67.04 కోట్ల లబ్ధి
- జగనన్న తోడు కింద 3,833 మందికి రూ.8.30 కోట్లు మంజూరు
- శ్రీనిధి కింద 20,163 మందికి రూ.70.10 కోట్లు
- ఉపాధి హామీ కింద 91,638 మంది కూలీలకురూ.300.81 కోట్ల లబ్ధి
- జగనన్న విద్యా కానుక కింద 29,335 మంది రూ.15.18 కోట్ల మంజూరు
- అమ్మఒడి కింద 29,861 విద్యార్థుల తల్లులకు 81.72 కోట్ల పంపిణీ
- మధ్యాహ్న భోజనానికి 27,306 మందికి రూ.9.51 కోట్ల వ్యయం
- వైఎస్సార్ నేతన్న నేస్తం 1,344 మందికి రూ.8.65 కోట్ల అందజేత
- 5,679 మందికి ఇంటి పట్టాలు, 7,864 మందికి పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ
- జగనన్న వసతి దీవెన 7,394 మందికి రూ.26.22 కోట్లు
- జగనన్న విద్యా దీవెన 7,461 మందికి రూ.49.80 కోట్లు అందజేత

నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు

- నియోజకవర్గంలో 251 సీసీరోడ్లకు రూ.1650.56 లక్షలు ఖర్చు చేశారు. 26 డ్రైనేజీ పనులకు రూ.702.11 లక్షల ఖర్చు
- రూ.6564.7 లక్షలతో 32 బీటీ రోడ్ల అభివృద్ధి
- నాడు-నేడు కింద 111 ప్రభుత్వ పాఠశాలల్లో 2631.89 లక్షలతో అభివృద్ధి పనులు
- రూ.4935.4 లక్షలతో 181 సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ కినిక్ భవనాల నిర్మాణం
- నాడు-నేడు కింద 8 పీహెచ్‌సీల అభివృద్ధికి 336.39 లక్షల వ్యయం
- 8 శ్మశాన వాటికలకు ప్రహరీ నిర్మాణం, అభివృద్ధి పనులకు రూ.141.65 లక్షల వ్యయం
- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద రూ.520.00 లక్షలతో అభివృద్ధి పనులు
- సీఎండీఎఫ్ కింద 69 పనులకు రూ.299.84 లక్షల వ్యయం

జగనన్న అండతో అభివృద్ధి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నా. నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు సంక్షేమ పథకాలను అందించాం. దశాబ్దాలుగా శింగనమల ప్రాంత ప్రజల కలగా నిలిచిపోయిన శింగనమల చెరువును లోకలైజేషన్ చేయించాం. నియోజకవర్గంలో సాగునీరు, తాగునీరుకు ఇబ్బంది లేకుండా చేశాం. జగనన్న సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళతాం.

– జొన్నలగడ్డ పద్మావతి, శింగనమల ఎమ్మెల్యే

శింగనమల నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వరాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని నార్పలకు రావడంతో, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనితో సీఎం రూ.520 కోట్లు మంజూరు చేశారు.

- చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామాలైన ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.168 కోట్ల మంజూరు.
- శింగనమల మండలం ఈస్ట్ నరసాపురంలో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణానికి రూ.35 కోట్ల కేటాయింపు.
- శింగనమలలో రూ.2 కోట్ల నిధులతో డాక్టర్. బీఆర్‌అంబేద్కర్ భవన నిర్మాణానికి అనుమతి
- మిడ్ పెన్నార్ డ్యాం నిర్వహణ నిమిత్తం రూ.3 కోట్ల విడుదలకు అమోదం
- నార్పలలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు రెండు ఎకరాలు, రూ.1 కోటి నిధులు కేటాయింపు
- చిత్రావతి నది మీద యల్లనూరు మండలంలో కేడీ రోడ్డు నుంచి చింతకాయమందకు రాకపోకల నిమిత్తం రూ.11.75 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి
- చిత్రావతి నది మీద కోడుమూర్తి నుంచి చిలమకూరు వరకు రూ.15 కోట్లతో కాజ్‌వే నిర్మాణానికి అంగీకారం
- పుట్లూరు మండలంలో సాగు, తాగునీరు సమస్య పరిష్కరించడానికి గండికోట రిజర్వాయర్ నుంచి సుబ్బరాయసాగర్ ట్యాంక్‌కు లిఫ్ట్ ద్వారా నీరందించే పథకానికి రూ.250 కోట్ల మంజూరు

నేటి కార్యక్రమాలు

'గడప గడపకూ మన ప్రభుత్వం'

యల్లనూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సోమవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

గుత్తి రూరల్: ఊబిచెర్ల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకటరామి రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి ఆదివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీరు పాల్గొనాలని కోరారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీ

తాడిపత్రి టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలో ర్యాలీ జరగనున్నట్లు స్థానిక పర్యావరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ర్యాలీకి జిల్లా మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. పర్యావరణ ప్రేమికులు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

మొక్కలు నాటే కార్యక్రమం

బుక్కరాయసముద్రం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దరాంపురంలోని పోలీస్ హౌసింగ్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాసరావుతోపాటు ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమి పూజ

పామిడి: పట్టణంలో పామిడమ్మ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి భూమిపూజ చేయనున్నారు. సీఎం డెవలప్‌మెంట్ ఫండ్స్ కింద రూ.10 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఏడీసీసీబీ చైర్‌పర్సన్



మంత్రి రామచంద్రారెడ్డిని కలిసిన పామిడి వీరా

పామిడి: రాప్తాడు సమీపంలో ఆదివారం రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన గుంతకల్లు నియోజకవర్గం పార్టీ స్థితిగతులపై మంత్రితో చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాయల మహేష్, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మెన్ పసుల నాగరాజు, నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: హంపీ మహాసంస్థాన పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శ్రీవిద్యారణ్య భారతి మహాస్వామీజీ జన్మ దినోత్సవం సందర్భంగా ఆ నలుగురు సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 36 మంది రక్తదానం చేశారు. ఆ నలుగురు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని బోధిస్తున్న హంపీ స్వామీజీ స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రక్తదాతలకు పండ్లు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి ఉపాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ప్రదీప్ ఆచారీ, చక్రపాణి, రవీంద్ర, చంద్రమౌళీ, సలీమ్, లింగేశ్వర్, నవీన్, కృష్ణమూర్తి, పురుషోత్తం, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

కమనీయం.. నారాయణుడి కల్యాణం



ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: పవిత్ర అశ్వర్థనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా స్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఆలయ అర్చకులు బాలసుబ్రమణ్య శర్మ, సునీల్ కుమార్ శర్మ, సుధీర్ కుమార్ శర్మ ఉదయం నుంచి స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను వధూవరులుగా పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. తర్వాత ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. వేడుకను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

రైలు ప్రమాద ఘటన దిగ్భ్రాంతికరం

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే వైవీఆర్, నాయకులు, కార్యకర్తలు

గుంతకల్లుటౌన్: ఒడిశా రాష్ట్రం బాలసోర్ జిల్లాలో జరిగిన రైలు ప్రమాద ఘటన దిగ్భ్రాంతికరమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. రైళ్ల ప్రమాద ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆదివారం రాత్రి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్, పొట్టి శ్రీరాములు సర్కిల్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు పెద్ద మొత్తంలో ఎక్స్‌గ్రేషియా చెల్లించి వారికి అండగా నిలవాలన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యచికిత్సలందించి వారిని ఆదుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఘటనలో చిక్కుకున్న ఏపీ వారి కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టిందన్నారు. భవిష్యత్తులో రైలుప్రమాదాలు జరగకుండా ప్రయాణికులకు భద్రత కల్పించాలని ఎమ్మెల్యే కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, జెడ్పీటీసీ కదిరప్ప, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజినేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు మహాలక్ష్మి, విద్యారాణి, నాగరత్న, కుమారి, ప్రభాకర్, లింగన్న, భాస్కర్, సుధాకర్, నగేష్, కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్‌వాహబ్, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అహమ్మద్‌బాషా, పార్టీ మండలాధ్యక్షుడు మోహన్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు మల్లికార్జున శాస్త్రి, భీమలింగప్ప, త్యాగరాజు, బావన్న, ఎల్లప్ప, శేఖర్, నాయుడు,సంపత్, సచివాలయాల పట్టణ, మండల కన్వీనర్లు ఎండీ.ఖలీల్, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: ఒడిశాలోని బాలసోర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఆదివారం యాడికిలో వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన తిమ్మప్ప

గార్లదిన్నె : ముంటిముడుగు కొత్తపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది వివరాల మేరకు.. కొప్పలకొండకు చెందిన తిమ్మప్ప కల్లూరు నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. కొత్తపల్లి సమీపంలో మలుపు వద్ద ఆటోను ఢీకొన్నాడు. ఘటనలో తిమ్మప్ప కాలు విరిగింది. స్థానికులు అతడిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యార్థులతో కలిసి జేవీవీ నాయకుల ట్రెక్కింగ్



గుత్తి కోటకు ట్రెక్కింగ్ చేయడానికి వెళుతున్న డిగ్రీ విద్యార్థులు, జేవీవీ నాయకులు

గుత్తి: చారిత్రక గుత్తి కొండకు ఆదివారం రాయదుర్గం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులతో కలిసి జేవీవీ నాయకులు ట్రెక్కింగ్ నిర్వహించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు చౌదరి విజయ భాస్కర్, కోట గైడ్ రమేష్ నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు చౌదరి విజయభాస్కర్ ట్రెక్కింగ్ చేసిన వారందరికీ అల్పాహారం, తేనేటి విందు ఏర్పాటు చేశారు. జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రంగన్న, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, వెంకటరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మహేంద్రరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్, నాయకులు శ్రీధర్ గౌడ్, దేశాయి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గుత్తి కొండపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు వందలాది మంది భక్తులు భోజనం చేశారు.

ముగిసిన జేవీవీ వైజ్ఞానిక శిక్షణ

పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కాలేజీలో శుక్రవారం ప్రారంభమైన జేవీవీ ఉమ్మడి అనంతపురం జిల్లా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ మోటార్ అపహరణ

గుత్తి రూరల్: ధర్మాపురంలో రైతు సూర్యనారాయణకు చెందిన విద్యుత్ మోటారు, పైపులను ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధిత రైతు తెలిపిన వివరాలు.. గ్రామ శివారులో తనకున్న నాలుగెకరాల పొలంలో రైతు మిరప పంట సాగు చేశాడు. ఉదయం పంటకు నీరు పెట్టేందుకు రైతు పొలం వద్దకు వెళ్లాడు. అయితే మోటారు, స్టార్టర్ బాక్సుతో పాటుగా పైపులు చోరీకి గురైనట్లు గమనించాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాముడూరులో ఇరు వర్గాల ఘర్షణ

గుత్తి రూరల్: మాముడూరులో చిన్నపాటి విషయంలో ఆదివారం ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన శ్రీరాములు, రామాంజనేయులు ఇళ్లు ఒకే వీధిలో పక్కపక్కనే ఉంటాయి. అయితే రామాంజనేయులు కుమారుడు మామిడి పండు తిని తొక్కను శ్రీరాములు ఇంటి ఎదురుగా పడేశాడు. ఆ విషయంపై ఇరువర్గాల మధ్య మధ్య మాటామాట పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడిలో ఇరువర్గాలకు చెందిన రాము, వెంకటమ్మకు గాయాలు కాగా గుత్తి అసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

పుట్లూరు: మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం నాగిరెడ్డిపల్లి సమీపంలో తాడిపత్రి-పుట్లూరు రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించని, రికార్డులు సరిగా లేని వాహనదారులకు జరిమానా విధించారు.

గోపుర కలశం వితరణ

పెద్దవడుగూరు : క్రిష్టిపాడులోని కుంటిమ్మతల్లి ఆలయానికి అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లేశ్వర రెడ్డి గోపుర కలశాన్ని వితరణ చేశారు. పురాతన ఆలయ పునరుద్ధరణలో భాగంగా రూ.30 వేలు వెచ్చించి కలశాన్ని అందించినట్లు మల్లేశ్వరరెడ్డి తెలిపారు.

రెడ్డి సొసైటీ మండల కన్వీనరుగా లక్ష్మీనరసింహారెడ్డి

యల్లనూరు: రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ మండల కన్వీనరుగా వాసాపురం గ్రామానికి చెందిన సానపరెడ్డి లక్ష్మీనరసింహారెడ్డిని ఎన్నుకున్నట్లు అధ్యక్షులు యర్రపరెడ్డి సురేంద్రరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రెడ్డి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని లక్ష్మీనరసింహారెడ్డి పేర్కొన్నారు.

వెండి వస్తువుల బహూకరణ

యల్లనూరు: మండల కేంద్రంలోని పెద్దమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దమ్మకు వెండి కోరలు, కళ్లను తాడిపత్రి బుగ్గరామలింగేశ్వర స్వామి ధర్మకర్త మాలపాటి భగీరథమ్మ, మాలపాటి రామచంద్రారెడ్డి దంపతులు సమర్పించారు.

సత్యసాయి విగ్రహ ప్రతిష్ఠకు తరలిరండి

తాడిపత్రి టౌన్: స్థానిక శివాలయం రోడ్డులో నూతనంగా నిర్మించిన భగవాన్ సత్యసాయి బాబా మందిరం విగ్రహ ప్రతిష్ఠకు భక్తులు తరలిరావాలని స్థానిక సత్యసాయి సేవా సమితి కో ఆర్డినేటర్ గంగాధర్ కోరారు. ఆదివారం ఆలయంలో గంగాధర్‌తోపాటు సమితి సభ్యులు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 5 నుంచి 7 వరకు గణపతి హోమం, దీక్షా హోమం, గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహిస్తామన్నారు, 8 న సత్యసాయి బాబా మందిరం, విగ్రహ ప్రతిష్ఠతోపాటు సత్యసాయి లక్ష్మీ నారాయణస్వామి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవన ప్రారంభిస్తామన్నారు.